# కనాను స్త్రీ ఆధ్యాత్మిక పాఠములు

కనాను స్త్రీ విశ్వాసమును ప్రభువు పరీక్షించి విజయము దయచేసాడు. యేసు తూరు సీదోను ప్రాంతములకు వచ్చినప్పుడు ఈ అద్భుతం చేసాడు. ఆమె సప్త సోపానములను అధిరోహించి తన కుమార్తెను బాగు చేయించుకున్నది. ఈ కనానీయురాలి గురించి కొన్ని ఆధ్యాత్మిక పాఠములను నేర్చుకుందాం. మత్తయి 15: 21 - 28

## 1. విశ్వాసము

ఈ స్త్రీ కనానీయురాలు, అన్యురాలు, యూదేతరాలు, ఆమె యేసునందు విశ్వాసముంచింది. కనాను దేవతలు, వైద్యులు, మంత్రజ్ఞులు ఎవరూ తన కుమార్తెను బాగుచేయలేకపోయారు, అందువలన యూదుడైన యేసు సర్వలోక పాలకుడని గుర్తెరిగి ప్రభువా అని సంభోదించుట గమనార్హం. ప్రభువునందు ఆమెకున్న విశ్వాసము అచంచవలమైనది.

## 2. ప్రేమ

ఈ స్త్రీ ప్రేమగల మాతృమూర్తి . ఎందుకంటే ఆ దినములలో ఆడ పిల్లలకు విలువ లేదు. స్త్రీలకు సమాజములో గౌరవము లేదు. మగ పిల్లల యెడల తీసుకునే శ్రద్ధలో కొంచెము కూడా ఆడ పిల్ల విషయములో తీసుకొనరు. ఆమె కూడా దానంతటు అదే తగ్గుతాదిలో అని అనుకోవచ్చు. కానీ తన కుమార్తె అయిన ఆడ పిల్లను ప్రేమతో బాగుచేయించుకోవాలనుకున్నది. అందుకే యేసును ఆశ్రయించి, నా కుమార్తెను బాగుచేయుమని ప్రాధేయపడుటకు ఆ తల్లి ప్రేమే కారణము.

## 3. పట్టుదల

ప్రభువు ఆమెతో ఒక్క మాటయైనను చెప్పలేదు ఎందుకనగా ప్రభువు ఆమె తన యందు నిజమైన విశ్వాసముంచినదా? అని పరీక్షించదలిచాడు. అయినను ఆమె ప్రార్ధన విడువలేదు. ప్రభువు జవాబు ఇవ్వలేదని కసురుకుంటూ తిరిగి వెళ్ళలేదు. పట్టుదలతో ప్రభువును గోజాడి ప్రాధేయపడి ప్రార్ధించింది .

## 4. సహనము

ప్రభువు మౌనము దాల్చాడు. శిష్యులు ఆమెను కసురుకొనుచున్నారు. అయినా ఆ స్త్రీ సహనముతో పట్టువిడువక ప్రభువును ప్రాధేయపడుచు కేకలు వేయుచు వెంబడించుచున్నది. ఎన్ని పరీక్షలు పెట్టినా ఆమె పట్టుదల సహనము సడలలేదు.

## 5. వినయము

ఆమెను అన్యురాలని నిందించినను, శిష్యులు తిరస్కారభావమును వ్యక్తపరచినను - యేసు మాత్రమే తన కుమార్తెను బాగు చేయగలడన్న అచంచల విశ్వాసము ఆమెను ఎంతో వినయశీలినిగా చేసినది.

## 6. విధేయత

ఈ స్త్రీ కి ప్రభువు మరొక మరింత కఠిన పరీక్ష పెట్టియున్నాడు. కనానీయులను కుక్కలుగాను యూదులను పిల్లలుగాను తెలియజేయుచున్నాడు. అయినను ఆ స్త్రీ సహనము కలిగి అవును ప్రభువా నేను కుక్కనే పిల్లలు కుక్కలకు రొట్టె ముక్కలు పడవేసినట్లు నన్ను కరుణించి నా కుమార్తెను బాగుచేయుమని వినయ విధేయతలతో ప్రాధేయపడుచున్నది.

## 7. విజయము

ఈ స్త్రీ విశ్వాసమును, ప్రేమను, పట్టుదలను, సహనము, వినయము, విధేయతలను చూచిన ప్రభువు చలించిపోయి అమ్మానీ విశ్వాసము గొప్పది. నీవు కోరినట్లే నీకు అవును గాక అని చెప్పాడు. ఆ ఘడియలోనే ఆమె కుమార్తె స్వస్థత నొంది, ఆమెకు విజయము కలిగినది.